ఎమ్మెల్సీల నిరసన

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలుపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలపై అధికార పార్టీ కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడుతుండటంపై పలువురు శాసన మండలి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ శాసన మండలి సభ్యులు ప్లకార్డులు చేబూని శుక్రవారం శాసన మండలి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. *– దుండిగల్, డిసెంబర్ 20;*

స్టాల్స్ ఓకే.. రైతులేరీ..?

పాలకులవన్నీ ఉట్టి కోతలే అనుకున్నారేమో..!

ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 20: వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాట్లు భారీగా జరిగినప్పటికీ, ఈ ఉత్సవాలకు ప్రధాన ఆయువు పట్టు అయిన రైతులు లేక ఉత్సవం, ఏర్పాటు చేసిన స్టాల్స్ వెలవెలబోయాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలు ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. అనంతరం, క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు మాత్రం ఆశించిన స్థాయిలో రైతులు రాలేదు. శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులతో కళకళలాడింది. ఎక్కువ మంది రైతులు వస్తారేమో కొంత సమాచారం, సలహాలు చెబుదామని వీసీ జానయ్య ఆహ్వానం మేరకు వచ్చిన రిటైర్డ్ వీసీలు, శాస్త్రవేత్తలు రైతులు లేకపోవడంతో కిమ్మనకుండా ఉండిపోయారు. మహిళా రైతులను వేళ్లపై లెక్కించొచ్చు. 'నమస్తే' పలువురి రైతులను పలుకరించగా, ఏడాదిగా సీఎం రేవంత్ రెడ్డి ఉట్టి మాటలే నరుకుతున్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు ఎక్కడా స్పష్టత లేని హామీలిస్తున్నారు. పాలమూరులో అనేక హామీలిచ్చారు. దేనికీ పొంతన లేదు. సభకు ఆయనొస్తారో లేదో? ఏమి మాట్లాడతారో.. ఆయనకే గుర్తుండదు! అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు వ్యవసాయ, అనుబంధం, రంగాల వారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు. వాటిని తిలకించే నాథుడే లేడు. ఇదంతా పాలకుల పరిపాటే గానీ, వర్సిటీ అధికారులు భోజనాలు, మెటీరియల్, వ్యవసాయ సమాచారం ఏర్పాట్లన్నీ బాగానే చేశారన్నారు.

అనుకున్న స్థాయిలో రైతులు రాక ఖాళీ కుర్చీలే

సమావేశాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

వ్యవసాయ రంగాన్ని అగ్ర భాగాన నిలబెడతాం: మంత్రి తుమ్మల

రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యతనిచ్చి, దేశంలోనే అగ్రభాగాన మన అభివృద్ధిని నిలబెడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను పురస్కరించుకుని క్రీడల ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. వరి, ఇతర పంటలో విప్లవాత్మక మార్పులు సంభవించాయని, అందులో భాగంగానే వరి ధాన్యం అధికంగా పండించి దేశంలోనే మొదటి వరసలో నిలిచామన్నారు.

అన్ని రకాల పంటలను ప్రోత్సహించాలి: గవర్నర్

కార్యక్రమాన్నిప్రారంభించిన గవర్నర్ డాక్టర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ వరితో పాటు అన్ని రకాల పంటలను ప్రోత్సహించాలని, ప్రధానంగా మిల్లెట్స్, నూనె గింజల పంటలను ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి మన రాష్ట్రానికి 25 టన్నుల నూనెలను దిగుమతి చేసుకుంటున్నామని గుర్తు చేశారు.

నగర వైద్యుడికి ప్రతిష్టాత్మక పురస్కారం

బంజారా హిల్స్, డిసెంబర్ 20: ఆటిజం వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి చికిత్సలో చేస్తున్న సేవలకు గాను హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత ఎన్ఆర్ఐ వైద్యుడు, ఏఏపీఐ అధ్యక్షుడు డాక్టర్ సతీశ్ కత్తులకు న్యూయార్క్‌కు చెందిన రైజింగ్ అవేర్‌నెస్ ఆఫ్ యూత్ విత్ ఆటిజం(రేవా) ఫౌండేషన్ పురస్కారం లభించింది. న్యూయార్క్‌లో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో డా. సతీశ్ కత్తులకు 'ది ఇన్‌స్పిరేషనల్ అచీవర్ 24' పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. 25 ఏండ్లుగా ఆటిజం వ్యాధిగ్రస్తులకు మద్దతుగా సేవా కార్యక్రమాలు చేస్తుండటంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించడంతో తనకు అవార్డు లభించిందని డా. సతీశ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రేవా ఫౌండేషన్ ప్రతినిధులు డా. రష్మీ శర్మ, మణికాంబోజ్ తదితరులు పాల్గొన్నారు.

జల మండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ మేకల సునీత

నీటి ఎద్దడిని నివారించాలి

జల మండలి ఎండీకి వినతి

నేరేడ్‌మెట్, డిసెంబర్ 20: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మంచినీటి ఎద్దడి నివారించాలని జల మండలి ఎండీ అశోక్ రెడ్డిని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌లు శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మి నరసింహస్వామి నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, బిహారి బస్తీ ప్రాంతాలలో మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నుంచి 2ఎంఎల్ నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జల మండలి ఎండీ అశోక్ రెడ్డి నీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మేకల రాము యాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ, వరద నీరు..

మల్కాజిగిరి: స్థానికంగా నెలకొంటున్న డ్రైనేజీ, వరదనీటి సమస్యను ప్రభుత్వం శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జల మండలి ఎండీ అశోక్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మచ్చ బొల్లారం డివిజన్‌లోని గ్రీన్ ల్యాండ్స్ ఎన్‌క్లేవ్, గంగా అవెన్యూ, శ్రీనివాసిక శాన్వి విల్లాస్, కాశీ పురం, ఎంహెచ్ఆర్ కాలనీ, ఎంఈఎస్ కాలనీల డ్రైనేజీతో పాటు వరద నీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో

మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో శుక్రవారం కొలువుదీరింది. ఈ ప్రదర్శన 22వ తేదీ వరకు జరగనుంది. నాలుగేండ్ల నుంచి ఎస్‌బీఐ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ ప్రాపర్టీ షోను హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్ కుమా, రెహ్బా చీఫ్ జనరల్ మేనేజర్ మంజు శర్మ తదితరులు ప్రారంభించారు.

– సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ);

ఆన్‌లైన్‌లోకి జీహెచ్ఎంసీ ప్రకటనల విభాగం!

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ ప్రకటనల విభాగంలో సంస్కరణలకు కమిషనర్ ఇలంబర్తి శ్రీకారం చుట్టారు. ఆదాయం పెంపు లక్ష్యంగా ఆన్‌లైన్ సేవలకు అడుగులు వేసింది. ఈ మేరకు ప్రకటనల విభాగంలోని కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. దుకాణాల వద్ద బోర్డుల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి చేశారు. ఈ క్రమంలోనే ప్రకటనలకు సంబంధించి అనుమతుల నుంచి రెన్యూవల్ వరకు ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. అంతే కాకుండా ట్రేడ్ లైసెన్స్‌లను అనుసంధానం చేయనున్నారు. తద్వారా ఎన్ని దుకాణాలు బోర్డుల ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారో తెలియనుందని అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా సైతం ఆన్‌లైన్‌లో విధించేలా మార్పులు తీసుకువచ్చారు. మరిన్ని వివరాలకు https://advt.ghmc.gov.in/Citizen/OTP_Validationa లో సంప్రదించాలని అధికారులు సూచించారు. అడిషనల్ కమిషన్ వేణు గోపాల్ రెడ్డి ఈ మేరకు ఆన్‌లైన్ విధానాన్ని కమిషనర్ ఇలంబర్తిని కలిసి వివరించారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

జల మండలి ఎండీని కలిసి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్ రెడ్డి



వాటర్ వర్క్ ఎండీ అశోక్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ)/ మల్కాజిగిరి: జల మండలిలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి జల మండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్మికులందరికీ జీవో 60 కేటగిరి-2 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కేటగిరి-1 ప్రకారం ఇవ్వడంతో రెండువేల మంది కార్మికులు నష్టపోతున్నారని ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సవరించి జీతాలు పెంచాలని ఎండీని కోరారు. మీటర్ రీడర్స్ వేతనాలు పెంపు, ఎస్టీపీ కార్మికులకు సకాలంలో వేతనాల చెల్లింపు, సీవరేజ్ కార్మికులకు పరికరాలు, అందరికి ప్రమాద బీమా, యూనిఫాం, స్వెట్టర్లు తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ, నాయకులు కిరణ్ కుమార్, అంజనేయులు, కుమార్, రమేష్, జగన్, వీరా స్వామి, రాములు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): బోరబండ నుంచి లింగంపల్లి వరకు ఉన్న 800 డయా ఎంఎస్ పైపులైన్‌కు సఫ్దార్ నగర్ వద్ద లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టడానికి ఈ నెల 22 (ఆదివారం)న ఉదయం ఆరు గంటల నుంచి మరుసటి రోజు 23 (సోమవారం) వరకు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు జల మండలి అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 24 గంటల పాటు పలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈ సందర్భంగా చెప్పారు. ఎస్పీఆర్ హిల్స్ సెక్షన్‌లోని జైపంత్ నగర్, సునీల్ నగర్, వీకర్స్ సెక్షన్, మహాత్మా నగర్, వినాయక్ నగర్, హబీబ్ ఫాతిమా నగర్ ఫేజ్-1, ఫేజ్-2, ఇంద్రనగర్, టి.అంజయ్య నగర్, బాబా సైలానీ నగర్, భరత్ నగర్, గాయత్రి నగర్, అల్లాపూర్, అజీజ్‌నగర్, శివ బస్తీ, మిరాజ్ నగర్, పద్మావతి నగర్, గాయత్రి నగర్, తులసి నగర్, వివేకానంద నగర్, పర్వత్‌నగర్, రామారావు నగర్, హరి నగర్, శివాజీ నగర్, ఆర్కే సోసైటీ, రాధాకృష్ణ నగర్, కేఎస్ నగర్, రాణా ప్రతాప్ నగర్, గణేశ్ నగర్ ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పుస్తక ప్రేమికులకు ఇదో పండుగ

తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి

మాట్లాడుతున్న ప్రముఖ సాహితీవేత్త నందిని సిధారెడ్డి, చిత్రంలో డా. నాశేశ్వరం, పద్మ

చిక్కడపల్లి, డిసెంబర్ 20: పుస్తక అభిమానులు, ప్రియులకు ఇదొక పండుగ అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. దోమలగూడ, ఇందిరా పార్కు సమీపంలోని ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. 30 వేల మందికి పైగా పుస్తక ప్రియులు ప్రదర్శను శుక్రవారం సందర్శించారని బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం 'నాకు నచ్చిన, మెచ్చిన, ప్రభావితం చేసిన పుస్తకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నాశేశ్వరం శంకరం, సి.వీరేందర్, తాయమ్మ కరణ, ముద్రబోయిన రచన, రఘు శీల కుమార్, వీరేందర్ తదితరలు హాజరయ్యారు. ప్రభావితం చేసిన కార్యక్రమాన్ని బుద్ధిరాజు ప్రవీణ్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ, పుస్తక ప్రేమికులకు ఇది పండుగ అని పేర్కొన్నారు. గతంలో పుస్తకాన్ని హస్తభూషణం అనే వారని, పుస్తకం చేతికి మాత్రమే ఆభరణం కాదని, పుస్తకం మస్తకానికి కూడా భూషణం అని వివరించారు. పుస్తకం చేతిలో ఉంటే చేతికి వెలుగుగా ఉందేడని అన్నారు. దాని సారాన్నంతా మెదడుకు అన్వయించుకుంటే మెదడుకు వెలుగు అని అన్నారు. తన జీవన గమనాన్ని మార్చి, మార్గదర్శనం చేసిన పుస్తకం 'శిథిల విపంచి' అని ఆయన చెప్పారు. తనకు నచ్చిన పుస్తకం తాళ్లూరి నాగేశ్వరరావు గారి 'మా ఊరి కథలు'గా పేర్కొన్నారు. అనంతరం, ప్రముఖ రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వట్టికోట ఆల్వార్ స్వామి రాసిన 'ప్రజల మనిషి, జైలు పుస్తకాలు' తన ఇష్టమని చెప్పారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, చేగోని రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సవారు ముస్లిం సాహిత్య వ్యాసాల పుస్తకం ఆవిష్కరణ

సంగిశెట్టి శ్రీనివాస్ రాసిన 'సవారు' ముస్లిం సాహిత్య వ్యాసాలు పుస్తకాన్ని డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్ మాట్లాడుతూ సంగిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేకంగా ముస్లిం సాహిత్యం మీద రాసినటువంటి వ్యాసాలు సాహిత్యానికి కొత్త వెలుగుల్ని తీసుకొస్తున్నాయని అన్నారు. సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ మత సామరస్యాన్ని బోధించేటటువంటి పుస్తకం చారిత్రక అవసరంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, అప్పర్, షాజాహనా, స్కైబాబా, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్ గౌడ్‌కు టమాట, కోడిగుడ్లతో స్వాగతం చెబుతాం

కోనాపురం శశిపాల్

కోనాపురం శశిపాల్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేస్తామని ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ఓయూలో టమాట, కోడిగుడ్లతో స్వాగతం పలుకుతామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనాపురం శశిపాల్ తెలిపారు. అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పారని, ఆ ఉద్యోగాలు ఎటుపోయాయని ప్రశ్నించారు. విద్యా భరోసా ద్వారా విద్యార్థులకు ఇస్తానన్న అయిదు లక్షలు ఏమయ్యాయో? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి జాడే లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. వర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ భర్తీ చేయలేదని, ఫెలోషిప్‌లు ఇవ్వలేదని, విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వలేదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు నియామక పత్రాలు అందజేసి, తామే ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుంటున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పైన పేర్కొన్న హామీలను నెరవేర్చిన అనంతరమే, ఓయూలో కాలు మోపాలని సూచించారు. లేని పక్షంలో తగిన సన్మానం చేస్తామని హెచ్చరించారు.

పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్లో..

లిఫ్ట్, ఎస్కలేటర్లను ఏర్పాటు చేయాలి

సింగరేణి భవన్ రిటైర్డ్ డీఎస్పీ దండం రాజు రాంచందర్ రావు

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు నగర ప్రజలకు ఉపయోగకరంగా ఉందని, బ్లూలైన్ పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల వయోధికులు, పిల్లలు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి భవన్ రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ దండంరాజు రాంచందర్‌రావు తెలిపారు. పరేడ్ గ్రౌండ్ పార్కింగ్ స్థలంలోకి రాకపోకలు సాగించడానికి మెట్ల దారి ఏర్పాటు చేసినప్పటికీ రెయిలింగ్ సరిగా లేకపోవడం వల్ల కిందపడిపోతామన్న భయం ప్రయాణికుల్లో కలుగుతున్నదని ఆయన అన్నారు. పరేడ్ గ్రౌండ్ స్టేషన్లో పార్కింగ్ స్థలం వైపు లిఫ్ట్, ఎస్కులేటర్ ఏర్పాటు చేయాలని రాంచందర్ రావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మహిళా సాధికారితకు కృషి చేద్దాం

కోటి మంది మహిళలు కోటీశ్వరులయ్యేలా.. లక్ష్యం సమీక్షలో అధికారులతో జీహెచ్ ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్‌లో ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పీఓలు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో ఆ శాఖల ప్రగతిపై కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. మహిళా సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోటి మహిళలను కోటిశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ఉన్నందున, నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంక్ లింకేజీ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూప్‌లో సభ్యులుగా చేర్చి ఆర్థిక సాధికారతకు దోహదపడే విధంగా కృషి చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు.

ఈ సంవత్సరంలో లక్ష్యం మేరకు..

బ్యాంక్ లింకేజీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 10,240 స్వయం సహాయక సంఘాలకు 704.67 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.543.43లను, 5016 సంఘాలకు బ్యాంకు లింకేజీ పంపిణీ చేసిన నేపథ్యంలో వచ్చే నెల వరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా మహిళలకు రూ.412 కోట్ల విలువ గల 487 యూనిట్లు అందించాలనే లక్ష్యం కాగా, రూ.1.59 కోట్ల 184 యూనిట్లకు పంపిణీ చేసినట్లు వివరించారు.

మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దండి

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో మొత్తం 7వేల మహిళా ఎంటర్ ప్రెన్యూయర్ షిప్ నెలకొల్పేందుకు నగర వ్యాప్తంగా రూ.410 కోట్లతో 6000 వ్యక్తిగత ఎంటర్ ప్రైజెస్, మరో 1000 గ్రూప్ ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి స్కీం ద్వారా గ్రూప్, వ్యక్తిగత ఎంటర్ ప్రెన్యూయర్ ఏర్పాటు రుణాలు అందించేందుకు గుర్తింపు చేసి ప్రాధాన్యతా క్రమంలో జనవరి 20 వరకు రుణాలు అందించేందుకు తీసుకోవాలన్నారు. ఇదే క్రమంలో పీఓలు, డీపీఓలు సర్కిల్ వారీగా సీఓ, ఆర్పీ వారీగా టార్గెట్ నిర్ణయించి, ఈ లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల విక్రేతలపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డా. మహిపాల్ యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డా. మహిపాల్ యాదవ్

రవీంద్రభారతి, డిసెంబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద నిరుద్యోగులకు అవినీతి అధికారులు ఉద్యోగాలు రానివ్వకుండా బ్యాక్‌లాగ్ పోస్టులను అమ్ముకుంటున్నారని, దీంతో ఎంతో కష్టపడి చదువుకున్న గ్రామీణ విద్యార్థులకు ఉద్యోగాలు రాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డాక్టర్ మహిపాల్ యాదవ్ అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టులు అమ్ముకుంటున్న వారిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ప్రభుత్వ అధికారులు, మధ్యవర్తులతో కుమ్మక్కై రూ.15 నుంచి 20 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వికారాబాద్ జిల్లాలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను అక్రమంగా అడ్డదారిలో భర్తీకి సన్నాహాలు చేస్తున్నారని, ఈ అక్రమ ఉద్యోగ భర్తీని ఆపకపోతే నిరుద్యోగుల తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నేతలు రాఘవేందర్, సూరన్న, చీమల జగదీశ్ యాదవ్, సురేశ్ యాదవ్, రాము, సంపత్ పాల్గొన్నారు.

ఐక్యంగా ముందడుగు వేద్దాం!

ఏకమౌతున్న సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీలు 28న ఉమ్మడి సభలో ప్రకటన

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ నాయకులు

ముషీరాబాద్, డిసెంబర్ 20: సైద్ధాంతికంగా రాజకీయ, భావసారూప్యం కలిగిన రెండు సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ పార్టీలు ఏకమౌతున్నట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. విద్యానగర్‌లోని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వేంకటేశ్వర రావు, వేములపల్లి వెంకట్రామయ్య, జేవీ చలపతిరావు, కె.గోవర్ధన్ మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా ఎన్నో నిర్బంధాలు, చిత్రహింసలు, బూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్న తరుణంలో విడిపోయిన రెండు పార్టీలు ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు తెలిపారు. అమరుల లక్ష్యాన్ని సాధించే క్రమంలో విప్లవ సంస్థలన్ని ఏకతాటిపైకి రావలసిన అవసరం ఉందని, కలిసికట్టుగా ఐక్య పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒకే సైద్ధాంతిక, రాజకీయ విధానం కలిగిన రెండు పార్టీలు విడిపోయి కొనసాగుతున్న క్రమంలో అఖిల భారత స్థాయిలో భావసారూప్యత కలిగిన రెండు పార్టీలు ఒకటి కావాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిపారు. ఇతర విప్లవ సంస్థలతో సైతం చర్చలు జరుపుతున్నామని, అంతా ఒకే గొడుగు కిందకు రావాలని భావిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు, నిర్బంధం ఫాసిస్టు నిర్బంధాన్ని కేంద్రం కొనసాగిస్తుందని, దీనిని ఎదుర్కోవడానికి ఉమ్మడి ఉద్యమాలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 28న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఐక్యతా సభలో రెండు సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ పార్టీల కలయిక ఉంటుదని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ కేంద్ర కమిటీ